భార్యను ప్రేమించకుండా
ఆమె మీద గెలవాలని
అతని కోరిక
ఫలించిందా?

# మది గదిలో

రమేశ్చంద్ర మహర్షి
కథ

జీవితం, దానికదే పోరాటం.

బతుకు, సంధ్యాకాలం రగిలే చితి పాఠం.

మనసు మూల ఆవేదన ఆరాటం,

ఆత్మ, మరవలేని జ్ఞాపకాల ఝంఝూటం

** ** **

పది సుదీర్ఘ సంవత్సరాలు తెలుగు సాహితీ రంగాన్ని మకుటం లేని మహారాజు లాగా ఏలిన రచయిత అతను.

అతని పేరు భగీరథ.

అతని రచనలు దాదాపు అన్ని భాషల్లోకీ అనువదించబడ్డాయి.

దేశం మొత్తం మీద, అతడికి లక్షలాది అభిమాన పాఠకులున్నారు.

కమర్షియల్స్‌తోపాటూ అనేక క్లాసిక్స్ వ్రాయడం వలన యూనివర్సిటీల నుండి డాక్టరేట్‌లూ, ప్రభుత్వం నుండి అవార్డులూ అందుకున్నాడతను.

రెండేళ్ళ క్రితం పద్మశ్రీ అవార్డు వచ్చినప్పుడు, గవర్నర్ తేనీటి విందుచ్చి, అతడి సాహిత్యం మానవజాతిని జడత్వం నుండి చైతన్యం వయిపు నడిపించేదిగా అభివర్ణించడం జరిగింది.

అతడికి కావలిసినంత పలుకుబడి, డబ్బూ, దర్పం అన్నీవున్నాయి. ఒక్క మనశ్శాంతి తప్ప. ఎందుకంటే, మనశ్శాంతి— కట్టుకున్న భార్య మీద ఆధారపడి వుంటుంది కనుక.

దురదృష్టవశాత్తూ ప్రతి మనిషీ ఇచ్ఛిత ంగా వైవాహిక జీవితం నెరపాలి కాబట్టి



అలాగా తొమ్మిదేళ్ళ క్రితం పెళ్ళి చేసుకున్నాడు.

అతడికి తల్లి లేదు, సవతి తల్లి యింటి నుండి చిన్నప్పుడే గెంటేసింది. అతడు గాలికి పెరిగేడు. ఆ భయంకరమయిన బాల్యం అతడికి దుఃఖాన్నిచ్చింది. ఆ దుఃఖం అతడిచేతి కవిత్వం వ్రాయించింది. ఆ కవిత్వం పాఠకుల్ని కదిపి కుదిపేసింది.

అభిమానుల్ని ప్రోది చేసింది. ఆ అభిమానం అతడ్ని ఈ పన్నెండేళ్ళ పాటూ ఎత్తిన కలం దించకుండా చేసింది.

అలాంటి మహా రచయిత, ఈ రోజు ఒక్క అక్షరం ముక్క వ్రాయలేక FRUSTRATION తో కొట్టుకుంటున్నాడు.

కువిమర్శకులు, అతడిలో 'సరుకు' అయిపోయిందన్నారు.

అభిమానులు అతడి కలం అల్లే కావ్యవీ చోపుల కోసం ఎదురు చూస్తున్నారు.

భగీరథ మాత్రం శ్లేష్మం లాంటి Psychological Suffocationలో కొట్టుకుంటున్నాడు.

అతడు రచయితగా మరో పదేళ్ళు కొనసాగేవాడే. అయితే అతడి కలం గళం మూగబోవడానికి కారణం అతడి భార్యే— ఆమె వేదవతి.

ఎందరో అమ్మాయిలూ, అభిమానులూ వచ్చి పెళ్ళి చేసుకోమని అడిగితే కాదని వేదవతిని కట్టుకున్నాడతను.

మొదటిరాత్రి ఆమె అడిగిన మొట్టమొదటి ప్రశ్న, "మీరు గేయాలు వ్రాస్తారటగా" అని— అవునన్నాడు భగీరథ—

"మీకు 'ఆడఫాన్స్' వున్నారా" అంది వేదవతి—

ఆడ ఫాన్స్... ఈ పదమే చాలా ఎబ్బెట్టుగా అనిపించినా, ఉన్నమాట చెప్పడం మంచిదని "ఉన్నారు" అన్నాడు—

అంతే ఆ రోజు నుండి, యింకా ఈ రోజు వరకూ అదే సమస్య అనేక కోణాల్లో, అనేక విచిత్రమయిన రంగులు పూసుకుని వాళ్ళ మధ్య నలుగుతూ వుంటుంది— అయితే అదే సమయంలో ఆమె చాలా విచిత్రంగా ప్రవర్తిస్తూ వుంటుంది— "నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నానూ, మీరూ అలాగే అనండి" అంటుంది—

ఒక రచయితగా అతడికి 'ప్రేమ' మీద ఓ గొప్ప అభిప్రాయం, Concept వున్నాయి — అలాంటి దాన్ని అంత తేలికగ్గా, ఎలా అనగలడు— ఆమె, తన ప్రవర్తన ద్వారా క్రమంగా ప్రేమని పరిప్లవించేలా చేయాలి తప్ప యిదేం విచిత్రమయిన కోరిక—

అందుకే అతడు అనలేదు— అయితే పెళ్ళయి,

నెల రోజులు గడవకముందే ఆమె ప్రవర్తన, అతడిలో అంతర్లీనమయిన అసహనాన్ని రేపింది—

ఉదయం ఎనిమిదయితే తప్ప ఆమె లేవదు—

రోజుకు పదహారు గంటలకి మించి పని చేసేవాడూ, నిరంతరం సాధనలో మునిగిపోయిన వాడూ, తనకి భార్య అన్నీ అమర్చిపెట్టాలనుకుంటాడు.

ఆ అదృష్టం లేదని మొదట్లోనే అర్థమయిపోయింది—

కేవలం వంట చేయడమే తన పనినీ, పృధివ్యాకాశాలు ఏకమయినా ఎనిమిదికంటే ముందు లేవనని ఘంటాఘోషంగా చెప్పేసింది వేదవతి—

దాన్ని పెద్దగా పట్టించుకోకూడదనుకున్నాడతను—

పెళ్ళయిన రెండో నెలలో, వెనక దండీమీద ఆరేసిన బట్టలు తెచ్చుకుని, "నీవీ తెచ్చుకో" అని అతడు అన్నప్పుడు "ఆ

చేత్తో నావి కూడా తెస్తే ఏ మవుతుంది'' అందామె—

విన్నప్పుడు కృష్ణమూర్తి పుస్తకం చదువుతున్నప్పుడు, అందులో 'Self-Confidence is part of Selfishness' అన్న వాక్యం చూసినప్పుడు కూడా అతడంతగా ఆశ్చర్యపోలేదు—

ఓ, నా వేదవతీ, భర్త చేతకానివాడూ, సెక్స్‌లో పొటెన్సీ తక్కువ వున్నవాడూ మాత్రమే అలాంటి పనులు చేస్తాడు— అన్న మాటలు పెదవుల కొస వరకూ వచ్చి ఆగిపోయినయ్ —

కొన్ని జీవితాలు కలవవు— అంతే—

పట్టుమని పదినిమిషాలు కలిసి మాట్లాడితే వాళ్ళ మధ్య అభిప్రాయభేదం వచ్చేసేది—

ఓసారి రెస్టారెంట్‌లో కూర్చుని మాట్లాడుతూ, ఏదో హాస్యానికి 'నాలాంటి పబ్లిక్ ఫిగర్' అనబోతుంటే,

''రెండు నవలలు వ్రాసేయగానే పబ్లిక్ ఫిగర్‌లయిపోరు, ఇక్కడ కూర్చున్న ఎంతమందికి మీరూ, మీపేరు తెలుసు'' అంది సూటిగా.

ఎప్పుడో బాల్యంలో సవతి తల్లిమాటలు కూడా, అతడ్ని యింత బాధించలేదు—

అక్కడి నుండీ వాళ్ళ మధ్య మాటలు చాలా తక్కువ దొర్లేవి—

ఎప్పుడయినా ఆమె మాట్లాడినా, ''ఆ ఉత్తరమేంటి 'దాని' నుంచేనా—

మీ బోడి సాహిత్యానికేనా, పడి చచ్చిపోతున్నానని వ్రాస్తోంది అనేది— ఆమె పుల్ల విరుపుడు మాటలూ, తనపట్ల ఎందుకో అర్థం కాని తక్కువతనం అతడు స్నేహితులతో ఎక్కువ గడిపేట్టూ చేసినయ్ —

'శత హస్త సమాహర, సహస్ర హస్త సంకర'— 'వంద విధాలుగా సంపాదించి వేయి విధాలుగా వెచ్చించు' అన్న వేద ప్రతిపాద్యమయిన వాక్యం అతడికి బాగా వర్తిస్తుంది— కానీ ఎంతని స్నేహితుల మధ్య గడుపుతాడు—



ఇంటలేని సుఖం ఎంతని బయట పొందుతాడు—

ఆ విధంగా క్రమంగా అతడిలోని రచయిత నిజంగానే హరించుకుపోయాడు—

ఈ రోజులే వేదవతి అనే రెండు వాక్యాలు మాత్రం అతడికి శూలాలై గుచ్చుకుంటుంటాయి— ఒకటి అనుమానం— రెండు ఐ లవ్ యూ అనమని—

"నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నట్టు మీరెందుకు నన్ను ప్రేమించలేదు— ఒక్కసారి ఐ లవ్ యూ అనండి"

ఆమె కవి మనసేంటో తనకి ఎప్పటికీ అర్థం కాదేమో—

ఏడాది క్రితం ఆమె కజిన్ వచ్చాడు— వచ్చి, "అడగక యిచ్చిన మనసే ముద్దు" అన్న పాటలో ఎన్నిసార్లు ముద్దు అన్న పదం వస్తుంది అని అడిగి, ఆమె చెప్పలేకపోతే ముప్పయిఆరు అని అతడు చెప్పినప్పుడు, అతడి పరిశీలనా శక్తికి ఆశ్చర్యపోతూ ఆరాధనాపూర్వకంగా చూడడం తనకి తెలుసు.

తనకున్న కీర్తి, అవార్డులూ ఇవేవీ ఆమెని కదిలించలేకపోయాయి— ఆమె కజిన్ మాత్రం కదిలించగలిగాడు

అలాంటి ఆమెని "నేను నిన్ను ప్రేమిస్తున్నానూ" అని ఎలా అనడం—

కానీ సంసారం ప్రారంభించి, ఇన్ని సంవత్సరాలయినా, వేదవతి అదే వాక్యాన్ని పట్టుకుందంటే, బహుశ అది ఛాలెంజ్‌గా తీసుకుందేమో అనుకున్నాడు— అదే నిజమయితే, తను పోయేలోగా ఎప్పటికయినా నేను నిన్ను ప్రేమించలేదు అని చెప్పిపోవాలి—

మేరేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్ అన్న వాక్యం ఎంత తప్పు—

నరకానికి మరో పేరయిన పెళ్ళిళ్ళు, హెవెన్‌లో ఎందుకు జరుగుతాయి—

Marriages are made in Hell.

అతడి కొడుకు ఎనిమిదేళ్ళ వాడయ్యాడు— అదేం దురదృష్టమో వాడు అంతా అమ్మ పోలిక— సంగీతమన్నా, సాహిత్యమన్నా వాడికిప్పటి నుంచే ఛీత్కారం—

ఒకవయిపున అశాంతి— ఒక వయిపున పత్రికల నుండి వత్తిడి— లేదు, వెళ్ళిపోవాలి — ఎక్కడికో వెళ్ళిపోవాలి— దూరంగా— చాలా చాలా దూరంగా...

ఓ అర్ధరాత్రి, ఎవరికీ చెప్పకుండా భగీరథ ప్రపంచం మీద పడ్డాడు— అతడికెందుకో అది ఓటమిలా అనిపించి, బెర్నార్డ్‌షా మాటలు గుర్తొచ్చినయ్—

"Man can climb to the highest summits, but he can not dwell there long"

** ** **

హిల్ స్టేషన్—

రైలాగింది— కిటికీలోంచి చూస్తోన్న భగీరథకి, ఆ కొండలూ, పచ్చటి మైదానాలూ, పల్చటి నీరదాలూ... ఆ ప్రకృతీ... అతడిలో ఏనాడో అడుగంటిపోయిన ఆవేశాన్నీ, ఆరాధననీ, భావుకత్వాన్నీ సున్నితంగా, సునిశితంగా స్పృశించినట్టయింది—

అక్కడ కొన్ని రోజులు గడపాలనిపించి, బాగ్ తీసుకుని దిగిపోయాక ఆ సాయంత్రం ఆ పర్వతాల ప్రాంగణంలో తిరిగి రావాలనిపించి

అతడు గెస్ట్‌హౌస్ నుండి బయటపడ్డాడు—

ఏదో ఒక అతీంద్రియమయిన శక్తి లాగుతున్నట్టు, నిర్దిష్టం కాని ఒక దిశవయిపు నడుచుకుంటూపోతే, ఎక్కడో ఓమూల విసిరేసినట్టున్న ఓ పాత యింటి దగ్గర తేలేడు భగీరథ—

ఊరికంత చివరగావున్న ఆ యింటి ముందు, 'లైబ్రరీ' అన్న బోర్డు తగిలించి వుంది— రచయిత కనుక ఆ పదం ఆప్తంగా అనిపించి లోపలికి నడిచాడు— పుస్తకాల వరసల చివర ఒకే ఒక స్త్రీ... ఏదో చదువుకుంటూ కనిపించింది—

అలికిడయినందుకు తలెత్తి చూసింది— ఆమె కతడు మరింత దగ్గరగా రావడం వలన ఆమె ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది—

ఆమె అందానికి అప్రతిభుడయి నిలబడి పోయాడు భగీరథ— ఒక్కమాటలో చెప్పాలంటే, ఆమె "జలతారు స్వప్నావశేషం"లా వుంది—

ఎక్కడో, ఎప్పుడో, సహస్రాబ్దాల వెనుక పారేసుకున్న జ్ఞాపకం, యిప్పుడు సజీవాకృతి దాల్చి ఎదుట నిలిచినట్టయి, చేష్టలు దక్కి అతడు నిలబడిపోయి చూస్తూవుంటే, అదే సమయానికి ఆమె మెల్లగా లేచి నిలబడి రెండు క్షణాలు పరిశీలించి నిర్ధారణ చేసుకున్నట్టూ,

"మీరు రచయిత భగీరథ కదూ" అంది—

ఒక మహా కళాకారుడి చేతిలోని జలవాదినలాగా అనిపించింది ఆమె గొంతు— ఆమెను చూస్తుంటే, పద, క్రమ, జట, మాలా, శిఖ, లేఖ, ధ్వజ, దండ, రథ, ఘన... భేదాలు మర్చిపోయిన వేద మంత్రం లాగా అతడి భావావేశం, ఒక వింత ఆహార్యాన్ని సంతరించుకుంది—

ఆమె ప్రశ్నకి ఏం సమాధానమిచ్చాడో, అతడికి తెలీదు—

ఆమె "నమస్తే" అనడం మాత్రం



## బూతు!

రుక్మిణి తన పెద్దకొడుకు పార్థుని కోపంగా అడిగింది.

"ఏరా తమ్ముడికి బూతు మాటలు నేర్పిస్తున్నావా?!"

"అబ్బే.. లేదు మమ్మీ! బూతు పదాలుగా మనం ఏవి వాడకూడదో నేను అన్నీ విడమరచి చెబుతున్నా!"

"......!!!"

—ఋషిశ్రీ (కమ్మపాలెం)

వినిపిస్తోంది—

** ** **

వారం రోజులు గడిచినయ్—

'సజాతి ధృవాలు వికర్షించుకుంటాయి' అన్న సూత్రం భౌతిక శాస్త్రంలో ఎంత సత్యభావాత్మకమో, అది మానసిక శాస్త్రంలో అంత సత్యదూరం—

ఆమె పేరు 'వెన్నెల'. ఆమెతో మాట్లాడుతోంటే అతడికి శరత్కాలపు పౌర్ణమి వెన్నెల్లో కూర్చున్నట్టు అనిపించేది—

ఆమె, తన సాహిత్యానికి భాష్యంలా కనిపించేది—

మొదటి రెండు రోజులూ ఆమెని, కేవలం అభిమానిగానే చూశాడు భగీరథ— పత్రికలలో అచ్చయి కూడా పుస్తకాల్లో చోటుచేసుకోని అతడి కవితలు, ఆమె తన ఇంట్లో చూపించి,

''వీటిని మీరెందుకు చిన్నచూపు చూశారో నాకర్థం కాదు'' అంది

అవార్డుల కోసం భయపడి, ఆ కవితలకి నిజంగానే చిన్నపీట వేశాడతను—

కానీ ఆ ప్రేమ కవితలు ఇన్నేళ్ళ తర్వాత తిరిగి చదువుతోంటే అతడికి తానెంత తప్పు చేసిందీ అర్థమయింది—

ఆమె నుండి ఆ కవితల కట్ట తీసుకున్నాడు—

అంటే ఇప్పుడు అతడి దగ్గర సిద్ధంగా ఓ కొత్త పుస్తకం వుంది— కొత్త జీవితం ప్రారంభించడానికి అది చాలు—

ఓ రోజు ఆమెతో కొండల మధ్య నడుస్తూ మాట్లాడుతోంటే ఆమె 'ఏంటో' అక్కడ తెలిసింది—

అనేక వేదికల మీద అతడు ఉపనిషత్తుల గురించి మాట్లాడాడు— కానీ ఏనాడూ అతడింత లోతుగా ఆలోచించలేదు—

ఉప, ని, అనే ఉప సర్గాలూ, సద్ అనే ధాతువు, కలిసి ఉపనిషత్ అయిందని, అతడికి తెలీదు—

'ఉప' అంటే సమీపమని, నిషద్ అంటే కూర్చునేది అనీ, అంటే ''పరమతత్వానికి సమీపంగా కూర్చునే జ్ఞానమే ఉపనిషత్'' అని వెన్నెల చెప్తోంటే భగీరథ శ్రోత అయ్యేడు—

అప్పుడు తెలిసింది, తాను జీవితంలో ఏం కోల్పోయేడో, తాను రచయితగా ఎందుకు మరణం పొందేడో...

అతడిలో తిరిగి చర్య ప్రారంభమయింది — ఇంక దాన్నెవరూ ఆపలేరు— ఎందుకంటే దానికి కావలసింది కేవలం ఒకటే—

అది ప్రారంభం—

** ** **

ఓరోజు సాయంత్రం ఇద్దరూ లైబ్రరీలో సాహిత్యం గురించి మాట్లాడుకుంటున్నారు — ఆకాశం అంతా దట్టమయిన మేఘాలతో నిండిపోయి వుంది.

ఏ క్షణంలోనయినా కుండపోత ప్రారంభమయ్యేలా వుందని లైబ్రరీ మూసేసి వెళ్ళిపోవాలనుకుంటుండగా వర్షం ప్రారంభమయ్యింది—

అసలే వర్షం— అదీ పర్వత సానువుల్లో—

లోపలికి జల్లుపడుతోందని కిటికీరెక్క

మూయడానికి వెళ్ళి, అలా బయటికి ఆ దృశ్య కావ్యాన్ని చూస్తూ నిలబడిపోతే వెన్నెల, వచ్చి అతడి పక్కగా నిలబడింది—

అలా ఎంతసేపు నిలబడ్డాడో తెలీదు— ఊచ మీదున్న తన చేతి మీద ఆమె చేయి ఆనినప్పుడు, అతడు స్పృహలోకొచ్చాడు—

అతడి చేతి మీద ఆమె చేయి— బిగుసుకుంది—

ఆత్మకి ఆత్మ తగిలినట్టయింది—

అతడామెను చూశాడు— లోపలికి పడుతున్న వాన విసురు, ఆమె ముఖ ప్రాతికం మీద తుహిన బిందువుల్లాగా తళుక్కుమంటుంటే ఆమెకి మరింత దగ్గరగా వచ్చాడతను—

ఆమె దించిన తలఎత్తలేదు— కమలాల్లాంటి ఆమె చెంపల్ని, అర చేతుల్లోకి తీసుకున్నాడు—

ఆమె స్తన భారంతో ఒంగిపోతోంది—

ఆలోచన కలిగించిన నిశ్శబ్దం, వాళ్ళిద్దరి మధ్యా తాండవిస్తోంటే, ఎదల గదులు ఘోషించడం కోసం, ఆమెను దగ్గరకు తీసుకున్నాడు— క్షణం... క్షణంలో పందో వంతు సమయం, అటునుండి యిటు విద్యుత్తు ప్రవహించినట్టూ, లిప్తకాలం ఎడద కంపనాన్ని కోల్పోయినట్టూ— వత్తిడి—

ఊహ, ఊపిరి పోసుకుని ఉలి చేతికి చిక్కినట్టూ... అలజడి— బయట వర్షం పడుతూనేవుంది—

మరో గంటకిగానీ అది నెమ్మదించలేదు —

** ** **


భగీరథ మరో రెండు నెలలు అక్కడే వుండిపోయాడు—

ఆమెని పెళ్ళి చేసుకుంటానంటే, ఒద్దంది—

"వివాహం అనుభూతిని సానుభూతి చేస్తుంది—

ఒకసారి మీరు కోల్పోయిన అనుభూతి మరోసారి కోల్పోవడం నాకిష్టంలేదు— ఈ

# కనిపించే నక్షత్రాలు



ఆకాశంలో 100,000 మిలియన్ల నక్షత్రాలు ఉంటాయని అంటారు. గ్రీకులు, ఇండియన్లు, రోమన్లు, అరబ్‌లు తాము కొన్ని పేర్లని ముఖ్యమైన నక్షత్రాలకు పెట్టుకున్నారు. ధృవ, అరుంధతి... క్రీస్తుశకం 137లో 1,025 నక్షత్రాలు ఉన్నాయని తేలింది. ఆధునిక రీసెర్చిని బట్టి 500,000 నక్షత్రాలున్నాయని తేలింది. అయితే 3000 నక్షత్రాలను బైనాక్యులర్స్ ద్వారా లేదా టెలిస్కోప్ ద్వారా చూడవచ్చు. ఎటొచ్చీ ఆకాశం క్లియర్‌గా ఉండాలి. ఫ్యాక్టరీల పొగలూ ఉండకూడదు.

వశీరవి

రెండు నెలల మీ సాంగత్యం చాలు, ఒక జీవితకాలం గడిపేయడానికి—"

ఆమెతో మాట్లాడుతున్న ప్రతిసారీ అతడి హృదయం ఐ లవ్ యూ అన్న వాక్యంలో ప్రతిధ్వనించేది— అయితే అతడే నాడూ పైకి అనలేదు— తన భార్యలా ఆమె అనమనీ అడగలేదు— ఆమెపట్ల తనకున్న ప్రేమని ఎప్పుడూ బయటపెట్టలేదు కూడా—

అక్కడే ఆ కొండల మధ్యనే ఉండిపోవాలో, నరకమయినా ఇంటికే వెళ్ళిపోవాలో తోచేది కాదు— ఈ వివాహ వ్యవస్థ మీదే అతడికి అసహ్యం వేసింది— క్రమంగా అతడి ఆలోచన మానసిక సంఘర్షణ మధ్యకి నెట్టబడడం ప్రారంభమయి, ఆ రాపిడికి భావం, సాహితీ రూపాంతరం చెందింది—

భగీరథలోని రచయిత తిరిగి విశ్వరూపం పొందడానికి ఆమె ఆ విధంగా స్ఫూర్తి అయింది—

అతడు వెళ్తానంటే ఆమె కాదనలేదు— ఆమెక్కావలిసిందీ అదే— అతడు తిరిగి మరో పదేళ్ళు సాహితీ రంగాన్ని ఏలాలి—.. తనకి దుఃఖం కలిగినా... అతడులేని ఏకాంతం, మరణశిక్ష విధించినా.... తానేమయిపోయినాసరే...

గౌరవం నుండి పుట్టిన ప్రేమ, త్యాగాన్ని కోరుకుంటుంది.

అతడు వెళ్ళిపోతున్న రోజున కూడా చెప్పలేదు, తాను నెల తప్పిన విషయం—

అతడు వెళ్ళిపోయాడు— అదే రోజున, ఆమె తల్లిపోయింది. ప్రపంచంలో ఆమె ఇప్పుడు ఏకాకి—

** ** **

ఇంటికి వెళ్ళిన తర్వాత వేదవతి, 'ఎక్కడికి వెళ్ళారు' అని అడగలేదు— దూషించింది— "నీలాంటి మనిషి మనగూడదు— మట్టిగొట్టుకుపోవాలి" అని శపించింది—

భగీరథ పట్టించుకోలేదు— వెన్నెల ఇచ్చిన కవితల కట్టని పుస్తకంగా అచ్చు వేయించేడు—

అనుకోని రీతిలో, అది ప్రభంజనాన్ని సృష్టించింది—

ఆ కుదుపు అందరి నోళ్ళూ మూయించింది— అంతటితో ఆగలేదు— మరో పదేళ్ళు తిరుగులేని చక్రవర్తినని నిరూపించుకున్నాడు—

అతడేం వ్రాసినా అన్యాపదేశంగా, ఎక్కడో వెన్నెల ఈ కథని చదువుతుంటుందన్న భావన కదిలేది— నిజానికి కేవలం ఆ ఆలోచనే అతడికి స్ఫూర్తి కలిగించేది—

తోటి సాహితీ కారులంతా, ఈ పదేళ్ళూ అతడి జీవితంలో ఓ స్వర్ణ యుగంగా నిర్ధారించేరు—

కాని అతడిలో అంతర్లీనంగా ఎక్కడో ఏదో అసంతృప్తి—

కొడుకు పెద్దవాడయిపోయేడు— కానీ వాడికి తనంటే ఎందుకో చిన్నచూపు— పత్రికల్లో కార్టూన్ మాడాలన్నా వాడికి వెగటే—

వేదవతి అలా తయారు చేసింది—

"అయినా, నాలాగా నా కోడలు అన్యాయమయిపోకూడదు" అనేది—

—ఆ మాటలు కొడుక్కి బాగా వంటబట్టినయ్—

తండ్రి రాక్షసుడిలాగా కనిపించేవాడు—

ఆ తల్లీ కొడుకుల చూపులు ములుకుల్లా గుచ్చుకుంటుంటే, అతడి ఆత్మ నరకం అనుభవించేది—

సరిగ్గా ఇలాంటి ఆవేదనలో అతడికి 'వెన్నెల'ని ఒకసారి చూడాలనిపించింది— అది బలీయమై, మనసుని ఒడిలిప్పేస్తోంటే, ఆమె దగ్గరకి బయలుదేరాడు—

ఆమె లేదు— విచారిస్తే ఎవరో చెప్పారు

కూతురితో తొమ్మిదేళ్ళ క్రితమే ఆవూరు విడిచి వెళ్ళిందని—

కూతురు... గాడ్... తన కూతురు— ఎప్పుడయితే ఆమె తన బిడ్డకి తల్లని తెలిసిందో, ఆమెతో తనకున్న మామూలు సంబంధం అతి పవిత్రమైందిగా అనిపించి, ఆమెని ఆ క్షణమే చూడాలన్న తపన అతడి గుండెని పిండేసింది—

దుఃఖాతిశయంతో ఇంటికి చేరుకున్నాడు—


ఆరోజు నుండీ మళ్ళీ ఏనాడూ అతడు కలం పట్టలేదు— ఎక్కడుందో, తండ్రిలేని ఆ బిడ్డతో ఈ జనారణ్యంలో ఎలా వేగుతుందో— భగవాన్, నావలన ఒక అమాయక జీవికి ఎంత కష్టం కలిగింది—

ఆమె ఎక్కడుంది— రః పదేళ్ళా ఎంత నరకం అనుభవించి వుంటుంది. అతడికి గతం పదే పదే మనసు తెరమీద నర్తిస్తోంటే దిగులుగా తన గదిలో కూర్చునేవాడు—

కేవలం ఒక అందమయిన స్త్రీగా ఆమెని వుపయోగించుకున్నానే తప్ప ఎన్నడయినా తనని ప్రేమించానని చెప్పగలిగానా—

ఐ లవ్ యూ అన్న వాక్యం మీద తనకెందుకింత పట్టుదల— బహుశా అందుకే, అందుకే ఆమె కూతురితో తన దగ్గిరికి రాలేదు—

ప్రేమే తమ శరీరాల కలయికకి కారణమని చెప్తే, ఆమె తప్పకుండా ధయిర్యం చేసి వచ్చేదేమో...



గదిలో లైట్ వెలిగించి— వేదవతి వచ్చి పక్కన కూర్చుంది—

"ఏం ఖాళీగా కూర్చున్నారు. ఏదయినా కథ వ్రాసుకోవచ్చుగా. గొంతులో అదే పొగరు ఇప్పటికీ—

వ్రాసినన్ని రోజులూ వ్రాయొద్దని మొత్తుకునేది— ఈరోజు వ్రాయలేని స్థితిలో వచ్చి వ్రాయమంటుంది... హు...

ఇంతకంటే గొప్ప ఇల్లాలు, ఈ భూప్రపంచం మీద ఎవరికయినా దొరుకుతుందా—

"మన పక్కింటి సరోజాదేవి లేదూ... అదే మహిళా మండలి ప్రెసిడెంటు... ఆమె నిన్న అందరిలోనూ చెప్తోంది. మీలో సరుకు అయిపోయిందట— మీ భాగోతం ముగిసిపోయిందట..."

ఆమెవరో అన్న దానికి, ఈవిడ వచ్చి వ్రాయమనడం— ఇలాంటిదానికి భర్తగా ఇన్నేళ్ళు కాపురం ఎలా చేసేడో అర్థం కాలేదతనికి—

మోటుగా అతడ్ని దగ్గరికి తీసుకుని, "ఐ లవ్ యూ" అంది— అని "మీరూ ఒక్కసారి అవండి... పెళ్ళయినా ఇన్నేళ్ళయినా మీరు ఏనాడయినా నన్ను ప్రేమిస్తున్నానన్నారా—" నాలో ఏం తక్కువ, అందమా, గుణమా..."

భగీరథ మాట్లాడలేదు— కానీ ఓ నిర్ణయానికొచ్చేడు—

అవును "ఐ లవ్ యూ" అన్న ఏ వాక్యాన్నయితే నేనిప్పటి వరకూ జీవితంలో ఎవరితోనూ అనలేదో, దాన్ని అంటాను... నాకు పునర్జన్మనిచ్చిన వెన్నెలతో అంటాను — అనాలి— నేను పోయేలోగా అనాలి—

మరో ఆరు నెలల కూడా గడవకముందే అతడు కృంగిపోయేడు, మనిషి బాగా వంగిపోయేడు—

ఓ రోజు కారేసుకుని ఊరి చివరికెళ్ళి మైదానాల్లో నడుస్తోంటే దూరంగా ఓ ఆటో వచ్చి ఆగింది—

పదేళ్ళ పాపతో, అందమయిన స్త్రీ అందులోంచి దిగింది— ఆమె వెన్నెల—

భూనభోంతరాళాలు ఏకమయిపోయి అల్లకల్లోలమయిపోయినంత భావోద్వేగం—

ఇది నిజమేనా... నిజమేనా... అక్కడే విగత జీవుడిగా మిగిలిపోతానేమో, అక్కడే కుప్పకూలిపోతానేమో అనిపించిందతనికి—

ఆమె తనని చూడలేదు— రాళ్ళు పాతిన స్థలాల్ని లెక్కిస్తోంది—

"వెన్నెలా" అన్న పిలుపుకి ఆమె వెనుదిరిగి చూసింది—

విస్ఫోటనమయిన మనస్థితిలో "మీరా" అంది...

ఆ మరుక్షణం అతడ్ని పట్టుకుని ఒక్కసారిగా ఏడ్చేసింది—

ఇన్నాళ్ళ, యిన్నేళ్ళ దుఃఖానికీ, ఆ స్పర్శ సేదతీరుస్తోంటే, పక్కనే పాప వుందన్న విషయం స్ఫురణకొచ్చి, ఆమె స్పృహలోకొచ్చి అతడి ఎదమీంచి లేచింది—

కళ్ళు తుడుచుకుని, పాపతో, "మీ నాన్నగారమ్మా" అంటోంది—

ఆమె రెండడుగులు అతడికి దగ్గరగా నడిచి, "నాన్నా" అంది, ఆత్మీయంగా—

ఆ పిలుపు అతడి అంతరాంతరాల్లోకి సూటిగా దూసుకుపోయింది—

ఆమె అచ్చం తనలాగేవుంది— తండ్రి పోలిక— అదృష్టవంతురాలు— తర్వాత వాళ్ళు ముగ్గురూ కారు దగ్గరికి వచ్చారు—

''పేరేంటి''

''భాగీరథి''—

ఆమె నుదిటి మీద చుంబిస్తోంటే, ఇన్నేళ్ళుగా అనుభవించని పుత్రవాత్సల్యం అప్పుడు ఫీలయ్యాడు భగీరథ—

''ఎలా వున్నావు వెన్నెలా, ఈ పదేళ్ళలో నా దగ్గరికి ఒక్కసారయినా రావాలనిపించలేదా''

ఆమె మాట్లాడలేదు—

ఆమె పెళ్ళి చేసుకోలేదన్న విషయం తెలిసి, ''నావలన నీకెంత కష్టం కలిగింది, నీకు బాధ కలిగించాను కదూ''

''లేదు— కానీ ఎప్పుడయినా బాధగా అనిపించిందనుకోండి, అది మీ వలనే అనుకోవడంలో కూడా ఓ తృప్తి వుంది''—

O Aching time! O moments big as years...

ఆమె వెళ్తానంది.

కాలం ఎంత చెడ్డది—

వెళ్ళే ముందు ఆమె అంది, ''అప్పుడు కాదన్నాను, కానీ ఇప్పుడు అడుగుతున్నాను. .. నా మెడలో ఓ పసుపుతాడు కట్టండి... అది నాకు సెక్యూరిటీ కోసం కాదు— మీరు నాకు భర్త అన్న తృప్తి కోసం...''

''కడతాను వెన్నెలా... నీ తృప్తికోసం కాదు... నా తృప్తికోసం... అదే వేయలేనప్పుడు నా జీవితానికి అర్థమే శూన్యమయిపోతుంది... రేపే... రేపే నీ మెడలో మూడు ముళ్ళూ వేస్తాను''

** ** **

అయితే విధి ప్రతికూలించింది— ఆ రోజు రాత్రే అతడికి స్ట్రోక్ వచ్చి పడిపోతే, అతడ్ని హాస్పిటల్‌లో చేర్చారు—

బ్రతుకుతానన్న ఆశ సన్నగిల్లింది— ఆ అవసాన దశలో ఒక్క పని మిగిలిపోయింది— ఆ ఒక్కటీ చేసి పోవాలి—



## కొత్త!

కొత్తగా పెళ్ళయిన పెళ్ళికూతురిని శోభనం గదిలోకి పంపుతూ పెళ్ళికొడుకు నానమ్మ అంది

''అసలే ఇద్దరూ ఒకరికి ఒకరు క్రొత్త, కాస్త అర్థం చేసుకొని మసలుకోండమ్మా...''

''మీరేం బెంగ పెట్టుకోకండి. క్రొత్త వాళ్ళతో ఎలా వ్యవహరించాలో నాకు బాగా తెల్సు''

''......!!!''

—ఆర్.పి.దేవర (నిజామాబాద్)

అయితే అదే సమయానికి వేదవతి అంతే. పట్టుదలగా వుంది—

అతడు పోతాడేమో అన్న అనుమానం ఆమెకి వచ్చినట్టుంది— అందుకే అతడితో ఒక్కసారయినా ప్రేమిస్తున్నాననిపించుకోవా లనుకుంది.

ఆమెకి డబ్బుంది. హోదావుంది— పెద్ద బంగ్లావుంది— కారుంది ఎద్దులా ఎదిగిన కొడుకున్నాడు—

అందుకే అతడు పోయినా వచ్చే నష్టమేమీ లేదు—

అయితే ఆ ఒక్క ముక్కా అనకుండా పోతేనే నష్టం—

ఆ మర్నాడు భగీరథ, తెలిసిన వ్యక్తి చేత పసుపుతాడు తెప్పించుకున్నాడు. వెన్నెలని పిలిపించుకున్నాడు. ఆమె కూతురితో వచ్చే సరికి, అక్కడ ఒక్కసారిగా యుద్ధవాతావరణం అయిపోయింది.

''ఇదన్నమాట అసలు కారణం'' అనుకుంది వేదవతి.

భగీరథని నానా శాపనార్థాలూ పెట్టింది. అయితే ఆమె ముందే తన పంతం నెరవేర్చుకోవాలనుకుంది.

''చెప్పండి, ఒక్కసారి చెప్పండి నన్ను ప్రేమించానని''

మృత్యువుకీ, జీవితానికీ మధ్య కొట్టుకుంటున్న భగీరథని పట్టుకుని పైకీ, కిందికీ కుదిపేసిందామె.

వెన్నెల నిర్లిప్తంగా చూస్తోంది.

సాహితీ ప్రపంచాన్ని తన మేధాశక్తితో మహారాజులాగా శాసించిన ఒక మహా రచయిత, యిన్నేళ్ళూ తన భార్య వలన మానసికంగా ఎంత నరకం అనుభవించి వుంటాడో ఊహించుకోగలిగింది.

మరణం మీంచి జీవనానికి ప్రయత్నించాడు భగీరథ—

కాని చేతకాలేదు. అతడి గుప్పిట్లో పసుపుతాడు బిగుసుకుంది.

''జీవితంలో నేను చాలా సాధించాను. ఒక్క భార్య మీద గెలుపు తప్ప. ఇది కూడా సాధిస్తాను. సాధించిన తృప్తితో కళ్ళు మూయాలి.

నిన్ను ప్రేమించలేదు వేదవతి, జీవితంలో ఏనాడూ నాకది సాధ్యం కాకుండా చేసేవు— మనసా వాచా నేను ఆమెనే భార్యగా అనుకున్నాను అని చెప్పేయాలి...

అతడి గొంతు మూగబోయింది. కళ్ళు జైర్లు కమ్ముతున్నాయి. అంతా చీకటిగా వుంది. ఏమీ కనిపించడం లేదు. అయిపోతోంది. నో... ఈ ఒక్క విషయం అనేయాలి. .. అనేయాలి...

మృత్యువు ఒక పాగలాగా అతడి మీద ఆక్రమించుకుంటోంది— నేను నిన్ను ప్రేమించేనని ఎప్పటికీ అనుకోకు వేదవతీ— అనాలి.

అతడి గుండె ఆఖరిసారి కొట్టుకుంది.

ఆఖరి గాలి— ఆఖరి నిశ్వాసం... అతడు వేదవతి వయిపు చూస్తున్నాడు. ''నిన్ను... ప్రేమించేను...'' ఆ వాక్యం పూర్తి కాలేదు.

అతడు కుప్పకూలిపోయేడు.

ఊహించని ఆ సంఘటనకి వెన్నెల నిర్ఘాంతపోయింది.

''ఈ అనంత కాల ప్రవాహంలో, ఈ

ప్రాపంచిక పరివేదనలో బ్రతుకు దుఃఖానికీ, దుఃఖానికీ మధ్య అసంతృప్తి వారధి—

ఎగతెగని పోరాటంలో రగులుతున్న ఎడద వేసే అవిశ్రాంత గారడి— ఓ వేదనావిష్కృత మయిన జీవితమా, మృతావశేషమయి నేను రాలిపోయినా నాడి, మృత్యువు దరి ఒడిపోని జీవనాడి—

అతడి కవితలు చెవుల్లో హోరుమంటుంటే ఒక్కసారిగా భోరుమందామె

వేదవతి గర్వంగా ఆమె వయిపు చూస్తోంది.

